

వెలుగు నీడలు

జిల్లా పారిశ్రామిక రంగంలో మరకలు, మెరుపులు

సార్వత్రిక ఎన్నికలతో జిల్లా ప్రస్థానాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఈ ఏడాది.. పారిశ్రామిక రంగానికి మరకలతో పాటు మెరుపులనూ అందించింది. గత ప్రభుత్వపు కక్షసాధింపు చర్యలతో ప్రతిష్ఠాత్మక పారిశ్రామిక సంస్థలు తమ విస్తరణకు ఇరుగుపొరుగు రాష్ట్రాలను ఎంచుకునే దుస్థితి కల్పించింది. సహచర సంస్థలు ఎదుర్కొన్న చేదు అనుభవాలతో అప్రమత్తమైన ఇతర సంస్థలు కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లా దరిదాపులకు కూడా రాలేదు. ఇలా ఏడాదిలో మొదటి సగం.. పారిశ్రామిక రంగం అథోగతిని చవిచూసిన జిల్లా.. తదుపరి ఆరునెలలు మాత్రం సీఎం చంద్రబాబు సొంత జిల్లాపై శ్రద్ధ చూపడంతో గణనీయమైన పురోగతి వైపు పరుగులు పెడుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తొలిసగం :

పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూలత కలిగిన జిల్లా.. కానీ గత ప్రభుత్వ తీరుతో ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో తీవ్ర ప్రతికూల పరిస్థితులను అనుభవించింది. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపలేదు. దీంతో ప్లాంట్లు నెలకొల్పేందుకు ఎవరూ ఆసక్తి కనబరచలేదు. కేవలం శ్రీసిటీ యాజమాన్యం చొరవతో అక్కడ మాత్రమే చెప్పుకోదగిన సంఖ్యలో కొత్త పరిశ్రమలు వచ్చాయి. అమరరాజా వంటి ప్రతిష్ఠాత్మక సంస్థను గత ప్రభుత్వం వేధింపులకు గురి చేయడం మిగిలిన పరిశ్రమలనూ భయపెట్టింది. అమరరాజా విస్తరణలో భాగంగా నూతన ప్లాంట్ల ఏర్పాటుకు తమిళనాడు, తెలంగాణను ఎంచుకోవాల్సి వచ్చింది. ఇతర పరిశ్రమలదీ అదే దారి అయింది. దీంతో తొలి ఆరు నెలల పాటు జిల్లాలో పారిశ్రామిక ప్రగతి స్తంభించింది.

కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుపై శ్రద్ధ

శ్రీకాళహస్తిలో ప్రింటింగ్ క్లస్టర్ నెలకొల్పడంలో భాగంగా రూ.25.19 కోట్లతో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించి రెండేళ్లు దాటుతున్నా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రాగానే దీనిపై దృష్టి పెట్టింది. కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు భూములు కేటాయించి.. పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

ఐటీ సంస్థల కోసం 565 ఎకరాలు

జిల్లాలో ఇప్పటికే వున్న ఈఎంసీల విస్తరణలో భాగంగా మరిన్ని ఐటీ ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలో తొలి దశలో కనీసం 500 ఎకరాలు కేటాయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. తిరుపతి నగర పరిధిలో ఐటీ పార్కు కోసం 50 ఎకరాలను కేటాయించాలని ఉత్తర్వులు ఇచ్చారు. తిరుపతిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు 15 ఎకరాలు కేటాయించడంతో పాటు ఇప్పటికే రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలోని రెండు ఈఎంసీలలో ప్రజా రవాణా, నాణ్యమైన విద్యుత్, వైద్య సదుపాయం, పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

శ్రీసిటీలో మరో 2400 ఎకరాల భూసేకరణ

శ్రీసిటీలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు అదనంగా 2400 ఎకరాల భూములు సేకరించాలని జిల్లా యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. జిల్లాలో రూ. 5 వేల కోట్లతో ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకొచ్చింది. ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్ సంస్థ కూడా రూ.3798 కోట్ల పెట్టుబడితో ప్లాంట్ నెలకొల్పేందుకు ఆసక్తి చూపుతోంది. డైకిన్ సంస్థ కూడా ప్లాంటు ఏర్పాటుకు ప్రతిపాదించింది. తొలి రెండు సంస్థలకు భూముల కేటాయింపు ప్రతిపాదనను గత నెల 20న క్యాబినెట్ ఆమోదించింది. డైకిన్ సహా పలు సంస్థలు ప్లాంట్లు పెట్టేందుకు ముందుకు వస్తుండడంతో శ్రీసిటీలో అవసరమైన భూములు సేకరించి ఏపీఐఐసీకి అప్పగించాలని సీఎం చంద్రబాబు కలెక్టర్‌ను ఆదేశించారు. అందులో భాగంగా ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సంస్థకు సత్యవేడు మండలంలో 400 ఎకరాలు కేటాయించనున్నారు. ఇతర పరిశ్రమల కోసం సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల్లో 2 వేల ఎకరాలు సేకరిస్తున్నారు.

మలి సగం :

70 రోజుల్లోనే తన మార్క్ చూపిన చంద్రబాబు

సీఎంగా బాధ్యతలు తీసుకున్న 70 రోజుల్లోనే చంద్రబాబు జిల్లాపై తన మార్క్ చూపించారు. ఆగస్టు 19వ తేదీన శ్రీసిటీలో పర్యటించిన ఆయన రూ.900 కోట్ల పెట్టుబడులతో 2740 మందికి ఉపాధి కల్పించేలా ఏడు పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. రూ.1213 కోట్ల పెట్టుబడులతో 4060 మందికి ఉద్యోగాలు అందించేలా ఐదు పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు.



ఆగస్టు 19న శ్రీసిటీలో భూమిపూజ చేస్తున్న సీఎం చంద్రబాబు

శ్రీసిటీలో చంద్రబాబు భూమిపూజ చేసిన పరిశ్రమలు

పరిశ్రమ	దేశం	పెట్టుబడి	ఉద్యోగాల సంఖ్య
ఏజీపీ సిటీ గ్యాస్	జపాన్	100 కోట్లు	450
బ్లూస్టార్	ఇండియా	500 కోట్లు	1500
ఎన్‌జీసీ	చైనా	100 కోట్లు	200
ఆర్ఎస్‌బీ	ఇండియా	100 కోట్లు	450
సిద్ధార్థ లాజిస్టిక్స్	ఇండియా	40 కోట్లు	50
టీఐఎల్ హెల్త్‌కేర్	ఇండియా	10 కోట్లు	40
వెర్మైరెన్ ఇండియా	బెల్జియం	150 కోట్లు	500
మొత్తం		900 కోట్లు	2740

వెంకటగిరి చేనేతపై లోకేశ్ ప్రత్యేక దృష్టి

యువగళం పాదయాత్ర సందర్భంగా వెంకటగిరి ప్రాంత చేనేత వర్గాలకు ఇచ్చిన హామీని నెరవేర్చుకునే దిశగా మంత్రి నారా లోకేశ్ చొరవ చూపిస్తున్నారు. టెక్స్‌టైల్ రంగంలో తన నియోజకవర్గమైన మంగళగిరితో పాటు వెంకటగిరిలోనూ కామన్ డైయింగ్ అండ్ ఈటీపీ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. దీనికోసం రూ.16 కోట్లు కేటాయించనున్నారు. వెంకటగిరి చేనేత కార్మికులతో న్యూ ప్రైమరీ హ్యాండ్ లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీలు ఏడింటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



శ్రీసిటీలో ఎంవోయులు కుదుర్చుకున్న పరిశ్రమలు

పరిశ్రమ	దేశం	పెట్టుబడి	ఉద్యోగాల సంఖ్య
ఆర్మ్‌వెస్ట్ మిరైటెక్ ఇండియా	సింగపూర్	40 కోట్లు	500
ఎక్సెలెంట్ ఫార్మా	ఇండియా	150 కోట్లు	500
క్యాప్‌మ్యాన్ ఇండియా	యూఏఈ	20 కోట్లు	50
డైకిన్	జపాన్	1000 కోట్లు	3000
ప్రెస్టైజ్ ఇంటర్నేషనల్	జపాన్	3 కోట్లు	10
మొత్తం		1213 కోట్లు	4060

మన్నవరం ప్లాంట్ భూములు వెనక్కి

శ్రీకాళహస్తి మండలం మన్నవరం వద్ద కేంద్ర ప్రభుత్వ రంగసంస్థలైన ఎన్‌టీపీసీ-భెల్ సంయుక్తంగా తలపెట్టిన విద్యుత్ ఉపకరణాల తయారీ ప్రాజెక్టు ఆగిపోయిన క్రమంలో ఆ భూములను పారిశ్రామిక అవసరాల కోసం వెనక్కు తీసేసుకోవాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ప్రాజెక్టుకు కేటాయించిన 620 ఎకరాలలో కేవలం 30 ఎకరాలు మాత్రమే ఎన్టీపీసీ-భెల్ సంస్థలు వినియోగించాయి. మిగిలిన 590 ఎకరాలను వెనక్కి తీసుకుని కొత్త పరిశ్రమలకు కేటాయించనున్నారు.



తిరుపతికి రహేజా, లులూ మాల్స్.. తాజ్ హోటల్

సీఎం చంద్రబాబు చొరవతో తిరుపతికి రహేజా, లులూ, తాజ్ హోటల్ రానున్నాయి. రహేజా మినీ మాల్ కోసం 10 ఎకరాలను, లులూ సంస్థ కూడా మినీ మాల్‌కు 15 ఎకరాలు అడిగాయి. ఇక తాజ్ గ్రూప్ హోటల్స్ యాజమాన్యం కూడా 15 ఎకరాలు ఇవ్వాలని కోరుతోంది.

ఏర్పేడులో డీఆర్‌డీవో ఫెసిలిటీ సెంటర్

ఏర్పేడు మండలంలో భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ అయిన డీఆర్‌డీవో ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు కానుంది. చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలంలో డీఆర్‌డీవో రక్షణ పరికరాల తయారీ ప్లాంట్ నెలకొల్పుతున్న నేపథ్యంలో ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పేడులో ఏర్పాటు చేయనున్నారు. దీనికి 46 ఎకరాలు కేటాయించాలని సీఎం చంద్రబాబు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.



తిరుపతి వెస్ట్ చర్చిలో..

ఘనంగా క్రిస్మస్

జిల్లాలో బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు భక్తిప్రపత్తులతో జరుపుకొన్నారు. చర్చిలన్నీ క్రైస్తవులతో కిక్కిరిశాయి. ఏసును స్తుతిస్తూ ప్రార్థనా గీతాలు ఆలపించారు. అందరూ ప్రేమ, త్యాగగుణాలతో శాంతిమార్గంలో నడవాలని పాస్టర్లు సూచించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



జగన్మాత చర్చిలో..

రాయలచెరువులో నేటి నుంచి పడవ పోటీలు

రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువులో గురువారం నుంచి డ్రాగన్ బోట్ (పడవ) పోటీలు ప్రారంభంకానున్నాయి. శాప్, ఏపీ కెనాయింగ్, కయాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ పోటీలు జనవరి 9వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇందులో ప్రతిభ చూపిన వారిని వచ్చేనెల 3నుంచి 6వరకు ఢిల్లీలో సీనియర్.. 11నుంచి 16వరకు కేరళలో జరిగే జూనియర్ 13వ నేషనల్ డ్రాగన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నారు. తొలిసారిగా ఇక్కడ జరిగే ఈ పోటీలకు విజయవాడ, వైజాగ్, చిత్తూరు, కర్నూల్, నెల్లూరు జిల్లాల నుంచి ఇప్పటికే దాదాపు 50మంది పేర్లు నమోదు చేసుకున్నారు. రెండు బోట్లలో 12మంది చొప్పున ఉంటారు. వెయ్యి మీటర్ల పొడవును వేగంగా ఛేదించిన వారిని గుర్తిస్తారు. ఇలా పలుమార్లు పోటీలు ఏర్పాటుచేసి చివరగా ప్రతిభావంతంగా రాణించిన క్రీడాకారులను ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు నేషనల్స్ పంపుతారు. ఈ పోటీలను గురువారం ఉదయం చంద్రగిరి ఎమ్మెల్యే నాని, శాప్ ఛైర్మన్ రవినాయుడు, జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ ప్రారంభించనున్నారు. పడవ పోటీలకుగాను బుధవారం ఏర్పాట్లు చేశారు.

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి



పొలంలో దంపతుల ఆత్మహత్య

● కుటుంబ కలహాలే కారణం

చంద్రగిరి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లె పంచాయతీ కూచువారిపల్లెలోని పొలంలో బుధవారం దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కూచువారిపల్లెకు చెందిన సురేంద్రనాయుడు, లత దంపతులు తిరుపతిలో నివాసం ఉంటున్నారు. సురేంద్రనాయుడు ఎస్పీడీసీఎల్‌లో సీనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఇద్దరు కుమార్తెలకూ వివాహమైంది పెద్ద కుమార్తె నైనా మలేషియాలో, చిన్న కుమార్తె లిఖిత అమెరికాలో స్థిరపడ్డారు. నాలుగు రోజుల క్రితం నైనా పుట్టింటికి వచ్చారు. బుధవారం ఉదయం ఇంట్లో చిన్నపాటి గొడవ జరిగింది. అనంతరం సురేంద్రనాయుడు, లత దంపతులు ద్విచక్ర వాహనంలో తిరుపతి నుంచి కూచువారిపల్లె వద్ద పొలానికి వచ్చారు. అక్కడి వేప చెట్టుకు ఉరేసుకున్నారు. సమీపాన ఇటుక బట్టీ కార్మికులు చూసి, స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. బంధువులు, స్థానికులు వీరి మృతదేహాలను చూసి బోరున విలపించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు నిర్వహించారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ కలహాల వల్ల ఆత్మహత్య చేసుకొన్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సురేంద్రనాయుడు, లత దంపతులు (ఫైల్ ఫొటో)

పరకామణిలో చోరీపై విచారణ కమిషన్ వేయాలి

● రవికుమార్ నుంచి రూ.కోట్లు చేతులు మారాయి
● ఒకే అపార్టుమెంటులో కొన్న 14 ఫ్లాట్లను టీటీడీకి రాయించుకుని రాజీ చేశారు
● సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తే అందరి జాతకాలు బయటకొస్తాయి ● టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి పరకామణి దొంగతనంపై విచారణ కమిషన్ వేయాలని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి డిమాండు చేశారు. పరకామణిలో జియ్యర్ మఠం ఉద్యోగి రవికుమార్ శ్రీవారి సొమ్మును చోరీ చేసి.. లోక్ అదాలత్‌లో రాజీ పడి టీటీడీకి స్వాధీనం చేసిన ఫ్లాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. తిరుపతిలోని మంగళం పోలీస్ స్టేషన్ ఎదురుగాగల పసుపర్తి అపార్ట్‌మెంట్‌లో రవికుమార్ 14 ఫ్లాట్లను కొన్నారని మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023లో పరకామణిలో చోరీపై జియ్యర్ మఠం ఉద్యోగి రవికుమార్‌పై నమోదైన కేసును పునర్విచారణ చేయాలని ఇప్పటికే తాను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావుకు విజ్ఞప్తి చేశానన్నారు. పోలీసుల ఒత్తిడితో లోక్ అదాలత్‌లో రాజీ పడ్డామని విజిలెన్స్ అధికారులు ఇచ్చిన నివేదికను ఆయన ప్రస్తావించారు. శ్రీవారి హుండీ చోరీకి సంబంధించి రవికుమార్‌ను అప్పటి విజిలెన్సు అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారన్నారు. ఆ తర్వాత రూ.40 కోట్ల విలువైన ఆస్తులను రవికుమార్ టీటీడీకి బదిలీ చేశారన్నారు. అయితే కేసు రాజీపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. రాజీ కోసం విజిలెన్సు అధికారులపై ఒత్తిడి తెచ్చిన పోలీసులు, టీటీడీ అధికారులు ఎవరో తేల్చాలన్నారు. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్నీ కోరతామన్నారు. హుండీలో రవికుమార్ దోచేసిన మొత్తాన్ని కక్కిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం శ్రీవారి ఖజానాను దోచుకుందని ఆయన మండిపడ్డారు. టీటీడీ విజిలెన్స్ రిపోర్టులో రూ.72వేల విదేశీ కరెన్సీ పట్టుకున్నట్టు ఉందన్నారు. ఇక, ఇండియన్ పోలీస్ సర్వీస్‌ను జగన్మోహన్ రెడ్డి పొలిటికల్ సర్వీసుగా మార్చాడని ఆరోపించారు. రవికుమార్ నుంచి పసుపర్తి అపార్ట్‌మెంట్‌లో 14 ఫ్లాట్‌లను టీటీడీ రాయించుకుందన్నారు. ఇవన్నీ దాదాపు రూ10కోట్ల విలువ చేస్తాయన్నారు. పూర్తిస్థాయిలో హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని, దోషులను భక్తుల ముందు నిలబెడతామని హెచ్చరించారు. దాదాపు రూ.500కోట్ల కుంభకోణం నడిచిందని, రవికుమార్ నుంచి కోట్లాది రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. అందుకే ఈకేసును నీరుగార్చారన్నారు. దీనికి సంబంధించి సాక్ష్యాధారాలు లేకుండా సీసీ ఫుటేజీని కూడా తొలగించారని ఆరోపించారు. ఈ కుంభకోణంలో పెద్ద తలల బాగోతం బయటపడుతుండడంతో రవికుమార్ ప్రాణాలకు ముప్పు ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆయనకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విజిలెన్స్ నివేదిక చదివిన తర్వాత టీటీడీలో ఇంత దారుణాలు జరిగాయా? అని కంట్లో నీళ్లు వచ్చాయన్నారు. దీనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిని కలిసి వివరించానని చెప్పారు. బీజేపీ నేత, అడ్వకేట్ అజయకుమార్ మాట్లాడుతూ.. భక్తులు సమర్పించిన కానుకలను దొంగలించిన రవికుమార్ కేసులో బలమైన 409 సెక్షన్ నమోదు చేయకుండా నామమాత్రపు సెక్షన్లు పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వరప్రసాద్, పొనగంటి భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



అపార్టుమెంట్‌లో ఫ్లాట్లను పరిశీలిస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

20 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురు నిందితుల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి 20.154 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. గాంధీపురం పంచాయతీ ధనలక్ష్మీనగర్‌కు చెందిన పి.చాంద్‌బీబీ, మదనపల్లె మండలం బురకాయలకోటకు చెందిన రసూల్‌బీ, మల్లంగుంట పంచాయతీ వినాయకనగర్‌కు చెందిన పి.సాయి, కొన్నేళ్ళుగా కింగ్‌పిన్‌ల నుంచి గంజాయి కొని అమ్ముతున్నారు. దీనిపై సమాచారం రావడంతో డీఎస్పీ ప్రసాద్ పర్యవేక్షణలో రూరల్ సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. అవిలాల చెరువు సమీపంలో కొందరు గుంపులుగా గంజాయి విక్రయిస్తున్నారని సీఐకు సమాచారం వచ్చింది. దీంతో అక్కడకు మఫ్టీలో వెళ్లిన పోలీసులు.. గంజాయి కావాలంటూ అక్కడ అడిగారు. దీంతో తమ వద్ద ఉందంటూ ముగ్గురు ముందుకురాగా.. అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి వద్ద విక్రయాలకు సిద్ధంగా ఉన్న 20.154 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు బురకాయల కోట నుంచి తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో సీఐతో పాటు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయితో పాటు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

చంద్రగిరి

ఆయుర్వేద శిబిరంలో 125 మందికి వైద్య పరీక్షలు


శిబిరం నిర్వహించిన వైద్య బృందం, లయన్స్ ప్రతినిధులు

పాకాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరంలో 125 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వెంకటేశ్వర ఆయుర్వేద వైద్య కళాశాల వైద్య బృందం పరీక్షలు చేసింది. వ్యాధులను పరీక్షించి రూ.2లక్షల విలువైన ఆయుర్వేదిక్ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డాక్టర్ తులసీల వైద్య బృందం, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు తులసీరామన్, ఆర్వీ ప్రసాద్, జి.గురుస్వామినాయుడు, జయరామ నాయుడు, దొరస్వామినాయుడు, రామయ్య కెఎస్ మస్తాన్, బాలాజీ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మనుధర్మశాస్త్ర ప్రతుల దగ్ధం



పాకాల, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ భవనం ఆధ్వర్యంలో బుధవారం మను ధర్మ శాస్త్ర ప్రతులను దగ్ధం చేశారు. అంటరానితనానికి, అక్రమాలకు అణచివేతలకు ప్రతీక మను ధర్మ శాస్త్రం అన్నారు. 1927 డిసెంబరు 25న రాయఘడ్‌లో ప్రతులను దహనం చేశారన్నారు. వారి వారసులుగా తాము ఈ కార్యక్రమం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో భవన కమిటీ కార్యదర్శి గణేష్, కె.బాబ్జీ, ఆదికేశవులు, ప్రభు, విజయమోహన్, జగన్నాథం, రామయ్య, జయబాల, శ్రీరాములు, శివప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో పలు మండలాలకు సంబంధించి ఐదుగురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం పంపిణీ చేశారు. రామచంద్రాపురం మండలానికి చెందిన వీరికి రూ.21లక్షలు సహాయ నిధి చెక్కులు అందజేశారు. అనారోగ్యం, ఇతర సమస్యలతో బాధపడుతున్న కొందరు తమ వెతలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి నిధులు మంజూరు చేశారు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళులు



చంద్రగిరి. డిసెంబర్ 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలను బీజేపీ నాయకులు సోమవారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని మాట్లాడుతూ సుస్థిర పాలన తీసుకొచ్చి ప్రధానమంత్రిగా వాజ్‌పేయి అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యంయాదవ్, మునిగంగిరెడ్డి, దొరస్వామి, నరేష్‌కుమార్ నాయుడు, సునీల్ యాదవ్, కుమార్‌నాయుడు, ఇందుశేఖర్, హనుమంతునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



చంద్రగిరి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మామండూరులో బుధవారం మాజీ సర్పంచ్ ఇందిర ఆధ్వర్యంలో కొత్త సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఏటా క్యాలెండర్‌ను గ్రామస్థులకు అందజేస్తామని ఇందిర తెలిపారు. డాక్టర్ బలరామ్‌రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నాగాలమ్మ ఆలయానికి త్వరలో అడహక్ కమిటీ


సమావేశంలో మాట్లాడుతున్న యుగంధర్‌రెడ్డి

చంద్రగిరి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): నాగాలమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ వివాదం కొలిక్కి వచ్చింది. పెద్దల నిర్ణయం మేరకు రెండు, మూడు రోజుల్లో అడహక్ కమిటీ ఏర్పాటు చేసి కొత్త కమిటీ నియమించనున్నారు. స్థలదాత వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి సతీమణి ముఖారీ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ వేణుంబాక సునందారెడ్డి ఆదేశాలతో ఆలయ ప్రతినిధిగా జడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డి నియమితులయ్యారు. త్వరలో పెద్దల సమక్షంలో ఆలయ అభివృద్ధి కమిటీ నియామకం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. భక్తుల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకూడదని నిబంధన విధించారు. బుధవారం ఆలయ ముందు ఆలయ చైర్మన్, గౌరవాధ్యక్షుడిల పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు. వెంకటంపేట, రాయలపురం, మల్లయ్యపల్లె, చంద్రగిరి గ్రామస్థులు పాల్గొన్నారు.

కౌశిక్‌కు జూనియర్ ఎన్టీఆర్ అండగా ఉన్నారు


మాట్లాడుతున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న అభిమాని కౌశిక్‌ను కాపాడతామని జూనియర్ ఇచ్చిన మాట తప్పలేదని, అన్ని విధాలా సాయం అందిస్తున్నామని జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు కృష్ణయాదవ్, నాని పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మాట్లాడుతూ కౌశిక్ తల్లి సరస్వతి ఇటీవల మీడియాతో చెప్పిన మాటల్లో స్పష్టత లేదన్నారు. వైద్యం పూర్తయిన తర్వాత కూడా కౌశిక్‌ను ఆస్పత్రిలో ఉంచడం వల్ల అదనంగా రూ.9 లక్షలు వృథాగా చెల్లించాల్సి వచ్చిందని తెలిపారు. ఈ విషయం కౌశిక్ చికిత్స పొందుతున్న చెన్నైలోని ఆస్పత్రిలో విచారణ జరపగా తెలిసిందన్నారు. అక్కడి వైద్యులు కౌశిక్‌కు వైద్యం పూర్తయ్యిందని, మరో మూడు నెలలు చెకప్ కోసం రావాల్సి ఉంటుందని చెప్పారని, అందుకు అవసరమైన ఖర్చులు కూడా తామే భరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మురళి, జానకిరామ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పవన్ కల్యాణ్ జాతీయ నాటకోత్సవాలు


విలేకరులతో మాట్లాడుతున్న సుబ్బరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం నుంచి పవన్ కల్యాణ్ జాతీయ నాటకోత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు మహతి కళాక్షేత్రంలో చేపట్టే ఈ కార్యక్రమాన్ని సుబ్బరాజు నాటక కళా పరిషత్ నిర్వహించనుంది. ఆ వివరాలను నిర్వాహకుడు కోనేటి సుబ్బరాజు బుధవారం విలేకరులకు వివరించారు. ఈ పోటీలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభిస్తారని తెలిపారు. 27న పుత్రదేవోభవ, ఆశకదరా శివ, హెచ్చరిక, 28న తపన, నిన్ను నువ్వు తెలుసుకో, తితిక్ష, అనగనగా ఒక రాజు..అనగనగా ఒక రాణి, 29న అంగికం భువనంయశ్య, యస్ నేనే నాటకాలు ప్రదర్శిస్తామన్నారు. తొలి మూడు స్థానాల్లో విజేతలకు రూ.40 వేల నగదు బహుమతులు, మరో పది మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. 90 బృందాలు పేర్లు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. సమావేశంలో నాటక కళా పరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు, ఉపాధ్యక్షుడు ఆమూరి సుబ్రమణ్యం, గోపాలరావు, మునిసుబ్రమణ్యం, కార్యవర్గ సభ్యులు జింకా నారాయణస్వామి, యశోద, శ్రీధర్ పాల్గొన్నారు.

దక్షిణాది యువజనోత్సవానికి తిరుపతి కళా బృందాలు


ఎస్వీయూ విద్యార్థుల బృందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించనున్న దక్షిణాది రాష్ట్రాల యువజనోత్సవానికి తిరుపతికి చెందిన పలు కాలేజీలు, యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు, కళా బృందాలు వెళ్లాయి. పద్మావతీ డిగ్రీ కళాశాల, ఎస్వీ యూనివర్సిటీ, పద్మావతి మహిళా యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు పలు కళా రూపాలను యువజనోత్సవాల్లో ప్రదర్శించనున్నారు. వీరు బుధవారం చెన్నైకి పయనమయ్యారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పద్మావతీ వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, పద్మావతి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ భద్రమణి వారిని అభినందించారు.

అమ్మవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి


ఆలయం వద్ద న్యామూర్తి డి.వెంకటరమణ

తిరుచానూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి డి.వెంకటరమణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద సూపరింటెండెంట్ రమేష్, అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం జస్టిస్ వెంకటరమణను ఆలయ వేదపండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

భాకరాపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం కోటబైలు పంచాయతీ తురకపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని కోరారు. ఈఏడాది జూలై 1 నాటికి 21-35 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులన్నారు. పోస్టు ఓసీ కేటగిరికీ కేటాయించారన్నారు. వచ్చే నెల 6వ తేదీలోపు దరఖాస్తులను చంద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

నేటి మండల మీట్‌కు ఎమ్మెల్యే హాజరు

భాకరాపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండల సర్వసభ్య సమావేశం గురువారం జరగనుంది. దీనికి ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరవుతారని టీడీపీమండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ తెలిపారు.

ఈవోపీఆర్డీ వెంకటరత్నం బాధ్యతల స్వీకరణ



చంద్రగిరి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల ఈవోపీఆర్డీగా వెంకటరత్నం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చంద్రగిరిలో పనిచేస్తున్న ఈవోపీఆర్డీ శశిరేఖ పాకాల మండలానికి బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తిలో ఈటీసీలో పనిచేస్తున్న వెంకటరత్నం తాజాగా బదిలీపై చంద్రగిరికి బదిలీపై వచ్చారు. ఎంపీడీవో శేఖర్ హాజరయ్యారు.

వైభవంగా గంగమ్మ జాతర



చంద్రగిరి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మామండూరులో వైభవంగా గంగమ్మ జాతర నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి గ్రామ సమీపంలోని స్వర్ణముఖినదిలో బంకమట్టిని తీసుకొచ్చి నడివీధి గంగమ్మ ప్రతిమను విశేషంగా అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం ఉదయం గ్రామస్థులు అమ్మవారికి పొంగళ్ళు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి పాటు టీడీపీ నాయకులు దర్శించుకున్నారు.

కారు ఢీకొని తీవ్ర గాయాలు

తడ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. వరదయ్యపాళెం మండలం తొండూరు గ్రామానికి చెందిన వెంకటే బుధవారం బైక్‌పై తడ వెళ్తుండగా శ్రీకాళహస్తి రోడ్డులో కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేష్ కుడికాలు విరిగిపోయింది.

భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

● చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
● వివిధ సేవాకార్యక్రమాలు




పాకాల సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చిలో పాస్టర్ ప్రేమ్ కుమార్ సందేశం- పాల్గొన్న క్రైస్తవులు- గుడ్‌సమ్‌రిటన్ హోలీ చర్చిలో క్రైస్తవ గీతాలాపన

పాకాల, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని క్రైస్తవులు బుధవారం భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. స్థానిక రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చిలో ఫాదర్ ఆంతోనిరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్రిస్మస్ ఆరాధన చేశారు. సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చిలో పాస్టర్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. గాదంకి జాషువా సీయోను చర్చి, హెబ్రోను మందిరము, పెనుయేలు మందిరం, క్రైస్ట్ మిరాకిల్ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. విక్టర్ ఎం.రాఘవేలు, జి.అరుళ్ సెల్వి తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు: తిరుచానూరు పంచాయతీలోని లివింగ్ క్రైస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనకు ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టాలన్ రాజు, ఎలిజిబెత్, జాన్, తదితరులు పాల్గొన్నారు.


తిరుచానూరు క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి: స్థానిక ఆంధ్రా లూథరన్ లూక్ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్ధనలు చేసారు. రెడ్డివారిపల్లె సమీపంలోని గడ్‌సమ్‌రిటన్ హోలీ మినిస్ట్రీలో ఏసు జననం, దేవదూతల ఘట్టాలు, జ్ఞానుల వేషధారణ ఆకట్టుకుంది. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ఫాస్టర్ ప్రభు ప్రేమ్‌కుమార్, ఎలియాజర్, అబ్రహం, తబిత గ్రేస్, తదితరులు పాల్గొన్నారు. సప్తగిరి కాలనీలోని సైయింట్ పాల్ చర్చిలో పేదలకు, వితంతవులకు దుస్తులు పంపిణీ చేశారు. రెవరెండ్ పాల్‌రాజ్, ముని, తదితరులు పాల్గొన్నారు. **ఎర్రావారిపాలెం:** ఎర్రావారిపాలెం క్రాస్, నెరబైలు, చాదావాండ్లపల్లె, బోడేవాండ్లపల్లె, ఎల్లమంద క్రాస్ ప్రసాద్‌నగర్,ఉస్తికాయల పెంటలోని చర్చిల్లో వేడుకలు జరిగాయి.

అంతర్ జిల్లాల దొంగ అరెస్ట్

● 117 గ్రాముల బంగారు ఆభరణాలు,నగదు స్వాధీనం


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న సీఐ మద్దయ్య

పాకాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంతర్‌జిల్లాల దొంగను పోలీసులు పట్టుకుని 117 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు... ఇటీవల పాకాల పరిసరాల్లో వరుసగా చోరీలు జరుగుతున్నాయి. దీంతో ప్రత్యేక నిఘా పెట్టారు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం పాకాల రైల్వే స్టేషన్ ఎదుట అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె రామారావు కాలనీకి చెందిన శ్రీనివాసులుగా గుర్తించారు. నిందితుడు చిత్తూరు, కదిరి, మదనపల్లె ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ పదేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. వివిధ జిల్లాల్లో 20 కేసులున్నాయి. తాజాగా ఇతని నుంచి 117 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు.

అమ్మవారి సేవలో మహారాష్ట్ర గవర్నర్


గవర్నర్ రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్డీవో రామ్మోహన్

తిరుమల...తిరుచానూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం రాత్రి తిరుపతి చేరుకున్నారు. రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు ఆర్డీవో రామ్మోహన్ తదితరులు స్వాగతం పలికారు. తర్వాత రాధాకృష్ణన్ తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేసి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. అనంతరం రాధాకృష్ణన్ రాత్రి తిరుమలకు చేరుకున్నారు. పద్మావతి అతిథిగృహం వద్ద ఆయనకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఖోఖో మహిళా జట్టు ఎంపిక


ఖోఖో క్రీడాకారులతో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి

కోట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ రోజు బుధవారం దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో మహిళా జట్టు ఎంపిక జరిగింది. వీరు ఈనెల 28న కేరళలోని సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కానికట్‌లో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీల్లో పాల్గొంటారు. ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి గాయత్రి, చందన, నాగేశ్వరి ఈ జట్టుకు ఎంపిక అయ్యారు. వీరికి కోచ్‌గా శోభారాణి వ్యవహరిస్తున్నారు. క్రీడాకారులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి షీల్డ్‌లు, మెమొంటోలతో అభినందించారు.

కొత్తవీరాపురం వద్ద ఇసుక అక్రమ రవాణా

ఏర్పేడు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తరలింపును అడ్డుకున్న రైతుపై దాడి జరిగినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. మండలంలోని మోదుగులపాళెం, కొత్తవీరాపురం మధ్య ఉన్న స్వర్ణముఖి నదిలో కొంతమంది అక్రమార్కులు గత నాలుగు రోజులుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దీన్ని అడ్డుకున్న తనపై అడ్డుకోగా బుధవారం సాయంత్రం దుర్వాసులునాయుడు దాడి చేసినట్లు రేణిగుంట డీఎస్పీ నరసింహమూర్తికి స్థానిక రైతు గాలి సుదర్శన్‌నాయుడు ఫిర్యాదు చేశారు. అలాగే రెవెన్యూ అధికారులకు, మైనింగ్ అధికారులకు కూడా సుదర్శన్‌నాయుడు ఫిర్యాదు చేశారు. ఇసుక రవాణాను అడ్డుకోకపోతే మోదుగులపాళెం, కొత్తవీరాపురంలలో వందలాది ఎకరాలకు సాగునీరు అందదని రైతు సుదర్శననాయుడు వాపోయారు. బుధవారం సెలవుదినం కావడంతో గురువారం ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామని అధికారులు తన మొబైల్‌కు ఫోన్ చేసినట్టు రైతు తెలిపారు.

శ్రీవారిసేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి


ఆలయం ముందు జస్టిస్ హృషికేష్ రాయ్

తిరుమల, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హృషికేష్ రాయ్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

● మాజీ మంత్రి ఆర్కే రోజా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె మూలమూర్తిని దర్శించుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని స్కూటరిస్టు మృతి

రేణిగుంట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామండూరు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని స్కూటరిస్టు మృతి చెందాడు. గుంటూరు జిల్లాకు చెందిన శ్రీనివాసులు(25) తిరుపతి నుంచి ద్విచక్రవాహనంలో కోడూరులోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో మామండూరు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని దుర్మరణం చెందాడు. అటుగా వెళ్తున్న వాహనదారుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 25,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద నివాసం ఉంటున్న సోమశేఖర్(46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మంగళవారం సోమశేఖర్ జగనన్న కాలనీలోని ఇంటి వద్దకు వెళాడు. అప్పటి నుంచి రెండు రోజులైనా ఫోన్ చేయకపోవడంతో బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులు వెళ్లగా రోడ్డుపై పడి ఉండడంతో 108వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే సోమశేఖర్ మరణించారని డాక్టర్లు నిర్ధారించారు. గురువారం పోస్టుమార్టం చేస్తామని డాక్టర్ సాయి తెలిపారు.

చింతలపాళెంలో చిరుత కలకలం


పంట పొలాల్లో పాదముద్రలు

ఏర్పేడు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపాళెం, శ్రీకాళహస్తి మండలానికి చెరందిన కుంటిపూడి సరిహద్దు పొలాల్లో రెండు రోజులుగా చిరుత సంచరిస్తున్నట్టు కలకలం రేగింది. దీంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు బుధవారం అటవీశాఖ సెక్షన్ అధికారి రెడ్డెప్ప చింతలపాళెం, కుంటిపూడి ప్రాంతాల్లో పర్యటించారు. రైతులు చెప్పిన ప్రాంతాల్లో పాదముద్రలను సేకరించారు. వాటిని పరిశీలించిన అనంతరం రెడ్డెప్ప మాట్లాడుతూ... పాదముద్రలు చిరుత, నక్క, అడవిపంది తదితరాలపై అనుమానం వ్యక్తం చేశారు. గురువారం కూడా ఆ ప్రాంతాల్లో అటవీశాఖ అధికారుల బృందం పర్యటించి పాదముద్రలను పరిశీలించనున్నట్లు చెప్పారు.

నేడు ఆర్థోపెడిక్ ఉచిత వైద్య శిబిరం

వెంకటగిరి టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోడు నాగేశ్వరరావు ఇంటి వద్ద గురువారం ఉదయం 6 గంటలకు తిరుపతి బర్డ్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆత్మవిశ్వాసానికి సాధన తోడైతే విజయం




విద్యార్థికి జ్ఞాపిక అందిస్తున్న నైనా జైస్వాల్, శ్వేత, రాజగోపాల్‌రెడ్డి తదితరులు

తిరుపతి(గాంధీరోడ్డు), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసానికి సాధన తోడైతేనే ఏ రంగంలోనైనా విజయాలు సాధ్యమవుతాయని టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి డాక్టర్ నైనా జైస్వాల్ తెలిపారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియం వేదికగా యశోదనగర్‌లోని లిటిల్ ఏంజల్స్ హైస్కూల్ 44వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ చదువుపై ఇష్టం పెంచుకోవాలని, సెల్‌ఫోన్లతో గంటల తరబడి సమయం వృథా చేయరాదని సూచించారు. వివిధ అంశాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. డైరెక్టర్ కేఆర్ శ్వేత, కరస్పాండెంట్ కె.రాజగోపాల్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎం.రమాదేవి, జాయింట్ సెక్రటరీ ఎం.శేఖర్‌రెడ్డి, డైరెక్టర్ సి.అరవింద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వై.పద్మశ్రీ పాల్గొన్నారు.

బ్యాటు.. బంతి చేతపట్టి

● క్రికెటర్లయిన కలెక్టర్, ఎస్పీ



బౌలింగ్ చేస్తున్న జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్ బ్యాటింగ్

కలెక్టర్ వెంకటేశ్వర్.. ఎస్పీ సుబ్బరాయుడు క్రికెటర్లుగా మారారు. బుధవారం రాత్రి తిరుపతిలోని ఎస్వీ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన 15 ఓవర్ల మ్యాచ్‌లో ఆడారు. శని, ఆదివారాల్లో విజయవాడలో అఖిల భారత సివిల్ సర్వీస్ అధికారుల క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. దీనికిగాను ముందస్తు సాధనకు కలెక్టర్ ఉపక్రమించారు. క్రిస్‌మస్ సెలవు కావంతో ఎస్పీ సుబ్బరాయుడు సహకరించారు. రెండు జట్ల మధ్యలో టీ20 మ్యాచ్ ఆడాలనుకున్నా.. సమయాభావంతో 15ఓవర్లకే కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్పీ జట్టు.. అన్ని ఓవర్లు ఆడి 144పరుగులు చేసింది. ఇందులో ఎస్పీ 10 పరుగులు చేశారు. కలెక్టర్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యచేదనలో కలెక్టర్ జట్టు 88పరుగులకే పరిమితమై ఓటమి చవిచూసింది.

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

రెండో విడత ధనుర్మాస బస్సు యాత్ర


బస్సుయాత్రను ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం సందర్భంగా ఆర్టీసీ రెండో విడత బస్సు యాత్ర బుధవారం ఉదయం మొదలైంది. సెంట్రల్ బస్టేషన్ నుంచి బయ లుదేరిన రెండు బస్సులు కాణిపాకం, శ్రీపురం, కాంచీపురానికి వెళ్లి తిరిగి అర్ధరాత్రి తిరుపతి డిపోకు చేరుకుం టాయి. యాత్ర చేయాలనుకునే భక్తులు 9440983564, 7382881507లను సంప్రదించాలని డిపో మేనేజర్ బాలాజీ కోరారు.

ప్రజలకు జీసస్ ఆశీస్సులు ఉండాలి : ఎమ్మెల్యే


పిల్లలకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు జీసస్ ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆకాంక్షించారు. నగరంలోని కేబీ లే అవుట్‌లో ఉన్న షెకీనా మినిస్ట్రీస్ చర్చ్, వెస్ట్ చర్చ్‌లలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పాస్టర్ల నుంచి దీవెనలు అందుకున్నారు. కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. జీసస్ చూపిన శాంతిమార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. ఎన్డీఏ అధికారంలోకి రాగానే పాస్టర్లకు గౌరవ వేతనం అందిస్తోందన్నారు. చర్చిల నిర్మాణం, పునరుద్ధరణకు ఆర్థికసాయం అందిస్తోందన్నారు. జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, టీడీపీ నాయకురాలు కుమారమ్మ, వినోద్‌రాయల్, మురళీనాథరెడ్డి, చందు, వెంకటేష్, మునస్వామి, మురళి, బాలసుబ్రహ్మణ్యం అయ్యంగార్, జానకిరామ్, శివ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

అంపశయ్య నవీన్ సాహిత్య పురస్కార స్వీకరణ


అవార్డు స్వీకరిస్తున్న కృష్ణస్వామిరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన రచయిత ఆర్సీ కృష్ణస్వామి రాజు ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్ సాహిత్య పురస్కారాన్ని స్వీకరించారు. ఆయన సాహిత్య కృషికి గుర్తింపుగా వరంగల్లులోని అంపశయ్య సాహిత్య సంస్థ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. శాలువా, పుష్పగుచ్ఛం, ధ్రువీకరణ పత్రంతో సత్కరించారు. పలువురు సాహితీవేత్తలు ఆయన్ను అభినందించారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకుందాం



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐటీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. ఈ మేరకు పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. మురళి మాట్లాడుతూ డిసెంబరు 25ను జాతీయ విద్యుత్ ప్రైవేటీకరణ వ్యతిరేక దినంగా నిర్ణయించామని, అందులో భాగంగానే ఈ ఆందోళన చేపట్టామని చెప్పారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తూ రాష్ట్రాలపైనా ఒత్తిడి తీసుకురావడం బాధాకరమన్నారు. విద్యుత్ సంస్థలను గుజరాత్ కార్పొరేటర్లకు ధారాదత్తం చేయడానికి కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. ప్రభుత్వాలు నియంతల్లా వ్యవహరిస్తే ప్రజలు, కార్మికులు, వినియోగదారులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలసుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం, వేణుగోపాల్, ఆర్.లక్ష్మి, నాగవెంకటేష్, బుజ్జి పాల్గొన్నారు.

అట్టడుగు జీవుల కంఠస్వరం సాహిత్యం

నాడోడి బతుకు నవలావిష్కరణ సభలో వక్తలు


పుస్తకావిష్కరణ చేస్తున్న రచయితలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని అట్టడుగు పొరల్లోని జీవుల కంఠస్వరంగా సాహిత్యం ఉండాలని వక్తలు అభిప్రాయపడ్డారు. జిల్లాకు చెందిన రచయిత మూరిశెట్టి గోవిందు రాసిన నాడోడి బతుకు నవలను తిరుపతి యూత్ హాస్టల్లో బుధవారం ఆవిష్కరించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు పలమనేరు బాలాజీ, వి.ప్రతిమ, అరసం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యుడు సాకం నాగరాజ, ఓఆర్ఐ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు, అరసం జిల్లా కార్యదర్శి యువశ్రీ మురళి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ తెలుగులో అనేక ప్రసిద్ధ నవలలు వచ్చాయని, గిరిజన నేపథ్యంతో వచ్చిన మూరిశెట్టి గోవిందు నాడోడి బతుకు నవల యానాదుల జీవితంలోని వైవిధ్యాన్ని అత్యద్భుతంగా చిత్రించిందని తెలిపారు. యానాదుల జీవితంలోని అనేక పార్శ్వాలను ఈ నవల తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో యువశ్రీ మురళి, రాజగోపాల్, గోవిందయ్య, ఏడుకొండలు, మౌని, తోట వెంకటేశ్వర్లు, పల్లెపట్టు నాగరాజు, చిత్రకారులు ఈసలాపురం బాలసుబ్రమణ్యం, ప్రసాద్, మునిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బంజారా జన్‌సంఘ్ సొసైటీ 7వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 27, 28 తేదీల్లో ఎస్వీ యూనివర్సిటీలో గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఆర్గనైజర్ హరిచౌహాన్ నాయక్ తెలిపారు. బంజారా సంఘం నేతలతో కలిసి ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో పోస్టరును విడుదల చేశారు. శ్రీవారి భక్తిని చాటిచెప్పే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బ్యూటిఫికేషన్ కోర్సు శిక్షణ పూర్తి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పద్మావతీ మహిళా యూనివర్సిటీలో పది రోజుల బ్యూటిఫికేషన్ కోర్సులో మహిళలకు శిక్షణ అందించారు. ఈ నెల 15 నుంచీ 25వ తేదీ వరకు కోర్సు పూర్తి చేసుకున్న మహిళలకు కోర్సు నిర్వాహకులు చైతన్య సర్టిఫికెట్లు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో కోర్సు అధ్యాపకులు పాల్గొన్నారు.

9 నుంచి వైకుంఠ ద్వార దర్శన టికెట్ల పంపిణీ

టీటీడీ ఈవో వెల్లడి
తిరుపతిలో ఏర్పాట్ల పరిశీలన



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో శ్యామలరావు బుధవారం తిరుపతిలో సుడిగాలి పర్యటన చేశారు. వైకుంఠ ఏకాదశికి సంబంధించి వచ్చేనెల 9వ తేదీ నుంచి జారీ చేయనున్న టికెట్ కౌంటర్లను పరిశీలించారు. ముందుగా రామచంద్ర పుష్కరిణి వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. గత ఏడాది 10 రోజుల పాటు టికెట్లు జారీ చేశామని, ఈసారి మూడు రోజులు మాత్రమే ఇస్తే కౌంటర్ల వద్ద తొక్కిసలాట జరిగే అవకాశాలున్నాయని అధికారులు ఈవో దృష్టికి తెచ్చారు. కొన్ని కౌంటర్ల వద్ద భక్తులు గంటల తరబడి రోడ్లపై నిలబడాల్సి వస్తుందని చెప్పగా టెంట్లు వేసి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఈవో ఆదేశించారు. అనంతరం భూదేవి కాంప్లెక్సు, జీవకోన, మున్సిపల్ గ్రౌండు, బైరాగిపట్టెడ, ఎంఆర్‌పల్లి ప్రాంతాల్లో కౌంటర్ల స్థితిగతులపై ఆరా తీశారు. కౌంటర్ల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, ఆహార పొట్లాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, టీటీడీ, రెవెన్యూ, ఇతర శాఖలు సమన్వయంతో పని చేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఈ సత్యనారాయణ, ఎస్ఈ వెంకటేశ్వర్లు, మనోహర్, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, టీటీడీ చీఫ్ పీఆర్‌ఓ రవి, తిరుపతి అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ, వీజీవో, ఏవీఎస్‌ఓలు మోహన్‌రెడ్డి, సతీష్ ఆయన వెంట ఉన్నారు.

9వ తేదీ ఉదయం 5 నుంచి టికెట్లు జారీ

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జనవరి 9వ తేదీ ఉదయం 5 గంటల నుంచి మూడు రోజుల పాటు తిరుపతిలోని ఎనిమిది కౌంటర్లు, తిరుమలలోని ఒక కౌంటరు ద్వారా టికెట్లు జారీ చేస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు చెప్పారు. భూదేవి కాంప్లెక్సు వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ భక్తులు ఆధార్ కార్డులు చూపించి, టోకెన్లు పొందవచ్చన్నారు. ఈసారి ఫొటోతో కూడిన స్లిప్పులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. 10నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు.




శాంతాక్లాజా వేషధారణలో చిన్నారి - ఖాదీ కాలనీలోని జగన్మాత చర్చిలో దీపాలు వెలిగిస్తున్న క్రైస్తవులు - రాజన్న పార్క్ వద్దనున్న ఈస్ట్ చర్చి వద్ద దీపాలు వెలిగిస్తున్న యువతులు

ఎస్ఏలకు అధ్యాపకులుగా పదోన్నతి ఇవ్వాలి


జీవో ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు

తిరుపతి(గాంధీరోడ్డు), డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు జూనియర్ అధ్యాపకులుగా పదోన్నతి ఇవ్వాలని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్(ఫోర్టో) జిల్లా చైర్మన్ దొడ్డ ఉమామహేశ్వర్ కోరారు. బైరాగిపట్టెడలోని ఎంజీఎం స్కూల్ ఎదురుగా సంఘ ఆధ్వర్యంలో పలువురు టీచర్లు బుధవారం జీవో ప్రతులను కాల్చి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా సెక్రటరీ పిల్లపాలెం మునిరత్నం ఇతర నాయకులతో ఉమామహేశ్వర్ కలసి మాట్లాడుతూ సర్వీసులో ఒకసారి కూడా పాఠాలు చెప్పని, కనీసం బీఈడీ విద్యార్హత లేని బోధనేతర సిబ్బందికి జూనియర్ అధ్యాపకులుగా పదోన్నతి కల్పించడం అన్యాయమన్నారు. తద్వారా విద్యార్థులకు తీరని నష్టం జరిగే ప్రమాదముందని ఆరోపించారు. అర్హతలు ఉన్న స్కూల్ అసిస్టెంట్లు లక్షల సంఖ్యలో ఉన్నా కేవలం ఒక జీవోను అడ్డుపెట్టుకుని పక్కనపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉపాధ్యాయ వర్గానికి తీరని అన్యాయం చేస్తున్న జీవో 223ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 302జీవో ఆధారంగా ప్రభుత్వ, పంచాయతీరాజ్ స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి ఇవ్వాలని కోరారు. నాయకులు విశ్వనాథం, శ్రీరాములు, చంద్ర, ఈశ్వరయ్య, వాసుదేవయ్య, దామోదరం, వెంకటాద్రి, మురళీకృష్ణ, రామ్మోహన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యం కొత్తతరాన్ని ప్రభావితం చేయాలి

జిల్లా రచయితల సంఘం తొలి వార్షికోత్సవంలో వక్తలు


సభలో ప్రసంగిస్తున్న మేడసాని మోహన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం ద్వారా కొత్త తరాన్ని సరికొత్త మార్గంలో నడిపించాల్సిన అవసరముందని వక్తలు పేర్కొన్నారు. తిరుపతి రచయితల సంఘం తొలి వార్షికోత్సవం స్థానిక యూత్ హాస్టల్లో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పంచసహస్రావధాని మేడసాని మోహన్ మాట్లాడుతూ సాహిత్యం మనిషినీ, సమాజాన్నీ సంస్కరించేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. తిరుపతి సాహిత్య వారసత్వాన్ని తిరుపతి రచయితల సంఘం కొనసాగించాలని సూచించారు. సభాధ్యక్షత వహించిన తోట వేంకటేశ్వర్లు మాట్లాడుతూ తక్కువ కాలంలోనే 64 మంది శాశ్వత సభ్యులు చేరడం సంతోషకరమన్నారు. విభీషణశర్మ మాట్లాడుతూ తిరుపతి రచయితల సంఘం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తిరసం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధరప్రసాద్ మాట్లాడుతూ కొత్త తరానికి భాషా, సాహిత్యం పట్ల మక్కువ పెంచడానికి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు పద్య పూరణం పీఠిక రాసిన అన్నమయ్య విరచిత 'శ్రీ వేంకటేశ్వర శతకం'ను అన్నమయ్య 12వ తరం వారసులు తాళ్లపాక హరినారాయణాచార్యులు ఆవిష్కరించారు. ఆచార్య దామోదరనాయుడు రాసిన 'ఇతిహాసాలు-నీతి ప్రబోధం' పుస్తకాన్ని తరిగొండ వెంగమాంబ వంశీయులు ఆవిష్కరించారు. ఈ పుస్తకాలను డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, డాక్టర్ పరమేశ్వరయ్య సమీక్షించారు. అనంతరం సాహితీవేత్తలు కె.సర్వోత్తమరావు, రచయిత్రి వి.ప్రతిమ, కవి పల్లెపట్టు నాగరాజులకు పురస్కారాలు ప్రదానం చేశారు. భాషా, సాహిత్య ప్రతిభ కనబరిచిన నేతాజీ అనాథ శరణాలయం విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గంగి సుహాసిని, డాక్టర్ కొణిదల శోభ, డాక్టర్ పొక్కుళ్ల సుభద్ర, యువశ్రీ మురళి, ఏనుగు అంకమనాయుడు, మౌని, మోహన మునిసిద్ధారెడ్డి, తమటం రామచంద్రారెడ్డి, గోవిందయ్య, పురుషోత్తమాచారి, రొద్దా సురేంద్రబాబు, గజేంద్ర, సుకుమార్, చెంయ్య, కేశవులు, గుల్జార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోండి సారూ...

స్కావెంజర్స్ కాలనీలో కంపు..కంపు



నగరంలోని లీలామహల్ - మున్సిపల్ మార్కెట్ మార్గంలోని స్కావెంజర్స్ కాలనీ వద్ద రోడ్డుపై చెత్తదిబ్బ పేరుకుపోయింది. ఈ మార్గంలో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. చెత్తకవర్లు, వ్యర్థాలను కుక్కలు, పశువులు రోడ్లపైకి లాగేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ముక్కులు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

\- తిరుపతి(లీలామహల్), (ఆంధ్రజ్యోతి)

ఎత్తుపల్లాలుగా రాయలచెరువు రోడ్డు



తిరుపతి అర్బన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు రోడ్డు ఎత్తుపల్లాలుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మార్‌పల్లె పోలీస్‌స్టేషన్ దాటుకున్న తర్వాత సగం రోడ్డు ఎత్తుగా, సగం రోడ్డు పల్లంగా ఉంది. గతంలో అరకిలో మీటర్ వరకు సీసీ రోడ్డు వేశారు. అంతవరకు ఎత్తుగా ఉంది. మిగిలిన సగం పల్లంగా ఉంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురైగాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును సరిచేయాలని కోరుతున్నారు.

నామినేటెడ్ సభ్యుడిగా ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాలా..!?

తిరుపతి(గాంధీరోడ్డు), డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ బోర్డు పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన కొత్తవిద్యామండలిలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ జూనియర్ కళాశాల(నారాయణ) ప్రిన్సిపాల్‌ని నామినేటెడ్ సభ్యుడిగా నియమించడం సమంజసం కాదని ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ తిరుపతి ఇన్‌చార్జి హరీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చేసిన కార్పొరేట్ కళాశాలలో పనిచేసే అధ్యాపకుడికి ఇటువంటి అవకాశాన్ని కల్పించడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఇంటర్ విద్యను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా ఈ నియామకాన్ని చేపట్టిందని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి



తిరుపతి (ఉపాధ్యాయనగర్), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి తిరుపతిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. టాటా నగర్‌లో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన నీతివంతమైన రాజకీయాలు నడిపారని పేర్కొన్నారు. కార్యక్రమం లో బీజేపీ నాయకులు గుండాల గోపినాథరెడ్డి, ప్రభాకర్ నాయుడు, సుబ్రహ్మణ్యం యాదవ్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, వాసు, రహీం, వీరంబాయ్, సుధాకర్, రాజశేఖరరెడ్డి, రాధారెడ్డి, గురుప్రసాద్, కేశవులు పాల్గొన్నారు.

పీఆర్‌సీలో సమస్యలు పరిష్కరించండి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల పర్యటనలో భాగంగా రాష్ట్ర ఇంధన కార్యదర్శి కె.విజయానంద్ తిరుపతికి వచ్చారు. ఓ స్టార్ హోటల్‌లో ఏపీఎస్‌ఈబీ ఇంజినీరింగ్ అసోసియేషన్ నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో ఉద్యోగులకు పీఆర్‌సీలో అమలుకాని సమస్యలను పరిష్కరించాలని కోరారు. పరిష్కరించడానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యు.రమేష్, పి.బాలాజీ, మునిప్రసాద్, జయప్రకాష్, భాస్కర్‌నాయుడు, వేణుగోపాల్, ఆంజనేయులు, అంజనప్ప, ఉమాపతి, మురళిలు ఉన్నారు.

పేదలకు అన్నదానం



తిరుపతి అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి తల్లి పులుగోరు నాగరత్నమ్మ 23వ వర్ధంతిని పురస్కరించుకుని బండ్ల వీధిలో బుధవారం పేదలకు అన్నదానం చేశారు. బండ్లవీధి యూత్ ఆధ్వర్యంలో ఆమె శిలాఫలకానికి పూజలు నిర్వహించి, దాదాపు 500 మందికి అన్నదానం చేశారు. కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, జనసేన పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి, బీజేపీ నాయకులు గుండాల గోపినాథరెడ్డి, టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహబూబ్‌బాషా, స్థానికులు మురకంబట్టి చంద్రారెడ్డి, పులుగోరు సతీష్‌రెడ్డి, పులుగోరు వీణారెడ్డి, గెంజి సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్పగారి చంద్రారెడ్డి, కన్నయ్య రాజా పాల్గొన్నారు.

టీటీడీ కాటేజీల డిపాజిట్లు జగన్ హుండీలోకి..: జనసేన


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నేత కిరణ్ రాయల్

తిరుపతి (వైద్యం), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో తిరుమలలో కాటేజీల కోసం భక్తులు చేసిన డిపాజిట్ల సొమ్ము జగన్ అండ్ కోకు చేరిందని జనసేన నేత కిరణ్ రాయల్ ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో టీటీడీలో ఎన్నో అక్రమాలు చోటుచేసుకున్నాయని, వాటిపై లోతైన విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కోట్లాది రూపాయలు పక్కదారి పట్టాయని తెలిపారు. టీటీడీ ప్రక్షాళన దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అధికారంలోకి రాగానే స్థానికులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించడం సుభప్రదమన్నారు. వైకుంఠ ఏకాదశికి సంబంధించిన టోకెన్ల జారీకి పక్కాగా ఏర్పాట్లు చేయాలని, భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన దిశగా పాలకమండలి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. సమావేశంలో జనసేన నేతలు సుమన్‌బాబు, మనోజ్, హేమంత్, కిషోర్, సాయిదేవ్ పాల్గొన్నారు.

పడవల బకాయిలు ఇవ్వండి సారూ..!

2019లో నిలిపేసిన వైసీపీ ప్రభుత్వం

తడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు రాక కాంట్రాక్టర్లే కాదు... అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇందులో మత్స్యకారులూ ఉన్నారు. ఏటా పక్షుల పండుగ జరిగే రోజుల్లో భీములవారిపాళెంలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో పడవ షికారు ఏర్పాటు చేస్తారు. 2019 జనవరిలో పక్షుల పండుగను టీడీపీ ప్రభుత్వం నిర్వహించింది. అప్పట్లో ఇరకం, భీములవారిపాళెం గ్రామాలకు చెందిన మత్స్యకారులు పడవ షికారుకు 26 బోట్లను ఏర్పాటు చేశారు. ఇందుకు ఒక్కొక్క పడవకు రోజుకు రూ.4వేలు అద్దె చెల్లించేలా అధికారులు నిర్ణయించారు. అడ్వాన్స్‌గా కొంత నగదు ఇచ్చారు. ఇంకా రూ.3 లక్షల వరకు బకాయిలు మత్స్యకారులకు చెల్లించాల్సి ఉంది. అనంతరం ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అయితే మత్స్యకారులకు అందించాల్సిన బకాయిలు చెల్లించలేదు. 2020 జనవరిలోనూ వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా పక్షుల పండుగ నిర్వహించింది. అంతకుముందే కృష్ణానదిలో బోట్ ప్రమాదం జరిగి సుమారు 50మంది వరకు మృతి చెందడంతో దాని పర్యావసానంగా పక్షుల పండుగలో పడవ షికారును రద్దు చేశారు. 2019లో పడవ షికారుకు ఏర్పాటు చేసిన 26 బోట్లకు ఇవ్వాల్సిన బకాయిలు ఇప్పించాలని మత్స్యకార నాయకులు పలుమార్లు అధికారులను వేడుకున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో పక్షుల పండుగ జరిగే రోజుల్లో భీములవారిపాళెం వద్ద ధర్నా సైతం నిర్వహించారు. అయినా వైసీపీ ప్రభుత్వం కనికరించలేదు. ఏ రోజుకారోజు వేటకు వెళ్లేసే పూట గడవని తాము పక్షుల పండుగ సమయంలో వేట మానేసి పడవలను ఏర్పాటు చేస్తే ప్రభుత్వం ముంచేసిందని మత్స్యకారులు వాపోతున్నారు. పడవల బకాయిల కోసం 2020 పక్షుల పండుగ సమయంలో అధికారులను గట్టిగా నిలదీసినందుకు వైసీపీ ప్రభుత్వం తనపై కేసు నమోదు చేయించిందని ఇరకం గ్రామానికి చెందిన మత్స్యకార నాయకుడు జయపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి తమకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలని మత్స్యకారులు అధికారులను వేడుకుంటున్నారు.

భూ సేకరణకు సహకరించండి


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మాయి, పక్కన ఏవో రవికుమార్, సత్యవేడు తహసీల్దార్ సుబ్రహ్మణ్యం

సూళ్లూరుపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పారిశ్రామిక వాడలో పరిశ్రమల కోసం భూ సేకరణకు రైతులందరూ సహకరించాలని ఆర్డీవో కిరణ్మాయి కోరారు. బుధవారం ఆమె తన ఆర్డీవో కార్యాలయంలో సత్యవేడు మండలం ఇరుగుళం, కొల్లాడం, పెద్దేటిపాకం గ్రామాలకు చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ గ్రామాల్లో వ్యవసాయ భూములను శ్రీసిటీ పారిశ్రామిక వాడలో నూతనంగా నిర్మించనున్న పరిశ్రమలకు కేటాయించారని, భూసేకరణ కసరత్తు చేస్తున్నామని, సంబంధిత రైతులు సహకరించాలన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో నష్టపరిహారంతో పాటు పరిశ్రమల్లో కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో రవికుమార్, సత్యవేడు తహశీల్దార్ టీవీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి సేవలు ఆదర్శనీయం


వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు బాలకృష్ణమ నాయుడు దయాకర్ తదితరులు

గూడూరు, కోట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు ఆదర్శనీయమైనవని బీజేపీ గూడూరు పట్టణాధ్యక్షుడు ఆరికట్ల బాలకృష్ణమనాయుడు అన్నారు. బుధవారం స్థానిక బాలసదనంలో వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దయాకర్, గాలి ప్రకాష్‌నాయుడు, శ్రీనివాసులు, బాలకృష్ణ, సురేష్, నిరంజన్, శివ తదితరులు పాల్గొన్నారు. కోటలోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు ఆధ్వర్యంలో నాయకులు నివాళులర్పించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విశ్వనాథం వాసు, వెంకయ్యగౌడ్, వెంకటేశ్వర్లు, కిషోర్, సురేష్, దీదీయా పాల్గొన్నారు.

ఖోఖో మహిళా జట్టు ఎంపిక


ఖోఖో క్రీడాకారులతో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి

కోట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ రోజు బుధవారం దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో మహిళా జట్టు ఎంపిక జరిగింది. వీరు ఈనెల 28న కేరళలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కానికట్‌లో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీల్లో పాల్గొంటారు. ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి గాయత్రి, చందన, నాగేశ్వరి ఈ జట్టుకు ఎంపిక అయ్యారు. వీరికి కోచ్‌గా శోభారాణి వ్యవహరిస్తున్నారు. క్రీడాకారులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి షీల్డులు, మెమొంటోలతో అభినందించారు.

కోర్టులో కేసు నడుస్తుండగా పంచాయతీ దుకాణాల వేలం సరికాదు

కోట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోర్టులో కేసు నడుస్తుండగా పంచాయతీ దుకాణాలకు వేలం నిర్వహించడం సరికాదని వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం వారు నిరసన తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 1996లో ఆర్టీసీ అధికారులు 26 దుకాణాలకు ఖాళీ స్థలం కేటాయించారన్నారు. తాము సొంత నిధులతో గదులు నిర్మించుకొని వ్యాపారాలు చేసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం ఈ స్థలం విషయమై దుకాణదారులకు, పంచాయతీకి మధ్య కోర్టులో కేసు నడుస్తోందని, ఇలాంటి సమయంలో వేలం పాటలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఇదే విషయమై కోట పట్టణ టీడీపీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్ మాట్లాడుతూ దుకాణాలకు వేలం నిర్వహించేందుకు గ్రామ పంచాయతీకి పూర్తి హక్కులు ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి 2018లో కోట సివిల్ కోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని దుకాణదారులు గుర్తించి ఈనెల 30న వేలం పాటలకు సహకరించి పంచాయతీ అభివృద్ధికి దోహదం చేయాలని షంషుద్దీన్ కోరారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయండి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): విజయవాడ లైలా గ్రీన్ మెడోస్ మైదానంలో జనవరి 5వ తేదీన నిర్వహించే హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని ప్రఖండ అధ్యక్షుడు నర్రా రవి బుధవారం పిలుపునిచ్చారు. విజయవాడ వెళ్లడానికి వెంకటగిరి నుంచి మూడు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు.


కోట విద్యానగర్ హోలిప్రేయర్ చర్చిలో ప్రసంగిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్



నాయుడుపేటలో కేక్ కట్‌చేస్తున్న వసంతకుమారి, పాస్టర్ ప్రేమ్‌కుమార్, శేఖర్, డాక్టర్ విజయామేరీ తదితరులు


హోలిప్రేయర్ చర్చిలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్, మేరీ సుజాత దంపతులు




సూళ్లూరుపేట పాలవల్లీవారివీధిలోని షారోన్ చర్చిలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్, ఏజీ కిషోర్ తదితరులు - వెంకటగిరిలోని పేతూరు లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

తడ, సూళ్లూరుపేట, గూడూరు, చిల్లకూరు, ఓజిలి, నాయుడుపేట, పెళ్లకూరు, కోట, దక్కిలి, వెంకటగిరి టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి తడలోని సైయింట్‌జాన్ లూథరన్ చర్చి, బాలయేసు పుణ్యక్షేత్రాలతో పాటు మండలంలోని వివిధ ప్రార్థనా స్థలాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. బుధవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. మతబోధకులు సురేంద్రపాల్, జోయల్‌వినిత్, జాన్ శశికుమార్, తడకండ్రిగ సర్పంచు తుమ్మా జయప్రద తదితరులు పాల్గొన్నారు. ● సూళ్లూరుపేట పట్టణంలోని పాలవల్లీవారివీధిలో ఉన్న షారోన్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, టీడీపీ నాయకులు అలవల శ్రీనివాసులు, ఈవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు. ● గూడూరు పట్టణంలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు జరుపుకొన్నారు. మంగళవారం రాత్రి నుంచే చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఎస్‌ఏఎల్‌సీ చర్చిలో పాస్టర్ డేవిడ్ ప్రశాంత్‌రాజ్ దైవ వాక్యాన్ని వినిపించారు. అదేవిధంగా ప్రార్థనామందిరం, సెవెంత్ డే అడ్వంటిస్ట్ చర్చి, హోసన్నా ప్రార్థన మందిరం, బాప్టిస్ట్ చర్చి, చర్చి ఆఫ్ క్రైస్ట్, చర్చి ఆఫ్ గాడ్, రోమన్ కేథలిక్ చర్చి, సాల్వేషన్ ఆర్మీ చర్చి, బేతస్థ ప్రార్థన మందిరాల్లో పాస్టర్లు ప్రార్థనలను ప్రారంభించారు. పేదలకు దుప్పట్లు, ఆహార పొట్లాలు పంచిపెట్టారు. ● గూడూరు పట్టణం గాంధీనగర్‌లోని బేత్లెహేము ఆరాధనా మందిరంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా బ్లెసింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ట్రస్ట్ ప్రతినిధి శ్రీనివాసులు, నాగరాజు, బాలపెంచలయ్య, బ్లెస్సీ, విజయ తదితరులు పాల్గొన్నారు. ● చిల్లకూరు మండలంలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఏరూరు సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. అన్నదానం, దుస్తులు పంపిణీ చేశారు. ● ఓజిలి మండలంలోని కురుగొండ, వెంకటరెడ్డిపాళెం, ఓజిలి, అత్తివరం, కుందాం, ఆరిమేనిపాడు, సగుటూరు గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఓజిలిలోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో పాస్టర్ రాజారత్నం క్రీస్తు సందేశాన్ని వివరించారు. ● నాయుడుపేట పట్టణంలోని జీసెస్ అపోస్తులు చర్చి, బేరిపేట లూథరన్ చర్చి, మేరీమాత చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించారు. జీసెస్ అపోస్తులు చర్చిలో వ్యవస్థాపకురాలు వసంతకుమారి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ● పెళ్లకూరు మండలంలోని చెంబేడు, చావాలి, పెళ్లకూరు, చెన్నప్పనాయుడుపేట, చావాలి, శిరసనంబేడు గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పేదలకు దుస్తులు పంపిణీ, అన్నదానం చేశారు. ● కోట మండల పరిధిలోని చిట్టేడు, గూడలి, కోటలోని బేరాకా, విద్యానగర్‌లోని ఎస్‌కేఎల్‌సీఎఫ్, చంద్రశేఖరపురం, తిన్నెలపూడి గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విద్యానగర్‌లోని హోలిప్రేయర్ చర్చిలో డాక్టర్ బిషప్ ప్రదీప్‌కుమార్, మేరీ సుజాత, బెన్నీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కోట జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ బిషప్ ఆశీర్వాదం పొందారు. అనంతరం న్యాయమూర్తి భరత్‌కమల్ క్రైస్తవ కుటుంబాలకు సందేశం ఇచ్చారు. పేద మహిళలకు ప్రదీప్‌కుమార్ చేతులమీదుగా చీరలు పంపిణీ చేశారు. ● దక్కిలిలోని బాలయేసు చర్చిలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఎస్ఎస్ఎస్ డైరెక్టరు ప్రాన్సీస్, పాదర్ విన్నయ్య ఆధ్వర్యలో ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి పిల్లలకు పంచిపెట్టారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ● వెంకటగిరి పట్టణంలోని కాశీపేటలో ఉన్న పేతూరు లూథరన్ చర్చి, చింతగుంటలో సియోన్ గాస్‌పాల్ చర్చి, రైల్వే స్టేషన్ పరిధిలోని షకీనా చర్చి, బెరయ ప్రార్థనా మందిరం, ఎస్టీ ఫ్రాన్సిస్ చర్చి, తిరుపతి రోడ్డులోని బెతాల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు.




దక్కిలిలోని బాలఏసు చర్చి, గూడూరులోని ఏరూరు సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో కేక్‌కట్ చేస్తున్న చిన్నారులు - గూడూరులో పేదలకు దుస్తులు అందజేస్తున్న బ్లెస్సింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అందరి సమన్వయంతో విజయవంతంగా సభ్యత్వ నమోదు


టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు వెంకటేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్ తదితరులు

గూడూరు అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసం వద్ద టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర సభ్యుడు వెంకటేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో గూడూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిపేందుకు కృషి చేసిన టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు వెంకటేష్ టాప్ రెఫరల్‌గా నిలవడంతో ఆయనను సన్మానించారు. ఇప్పటికే నియోజకవర్గంలో 55వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేశామని, త్వరలోనే 60వేల లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, బత్తిని ప్రణీత్, ముప్వా చరణ్, వేముల సునీల్, సందీప్, రవీంద్రరెడ్డి, నాగరాజు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చాగణం ట్రస్టు సేవలు అభినందనీయం


మహిళకు దుస్తులు అందజేస్తున్న డీఎస్పీ చెంచుబాబు, ట్రస్టు సీఈవో సీతారామనాయుడు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు అందిస్తున్న సేవలు అభినందనీయమని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. బుధవారం పట్టణంలో చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టైలరింగ్, మగ్గం, కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ఉచితంగా శిక్షణ అందించడం వల్ల ఎంతో మందికి ఉపాధి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సీఈవో సీతారామ నాయుడు, ఏవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్థోపెడిక్ ఉచిత వైద్య శిబిరం

వెంకటగిరి టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోడు నాగేశ్వరరావు ఇంటి వద్ద గురువారం ఉదయం 6 గంటలకు తిరుపతి బర్డ్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెత్త కుప్పల తొలగింపు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో ఎక్కడా చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయని ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న చెత్తకుప్పలను తొలగింపు పనులు చేపట్టారు. మున్సిపల్ కార్మికులు ఉదయాన్నే ట్రాక్టర్లు తీసుకువచ్చి చెత్త తీసి తరలించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వెంకటగిరి టౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వివేకానందా యువసైన్యం నూతన క్యాలెండర్‌ను ఆనం చెంచు సుబ్బారెడ్డి, ఏపీపీ ప్రకృతి కుమార్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు ఫణీంద్ర, ధనియాల శ్యాం, చిన్నమద్దేరి గోపీనాథ్, మన్నూరు అరవింద, దండోలు శ్రీనివాసులు, చిట్టమూరి చరణ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత ధనుర్మాస బస్సు యాత్ర

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా ఆర్టీసీ రెండో విడత బస్సుయాత్ర బుధవారం ఉదయం మొదలైంది. సెంట్రల్ బస్టేషన్ నుంచి బయలుదేరిన రెండు బస్సులు కాణిపాకం, శ్రీపురం, కాంచీపురానికి వెళ్లి తిరిగి అర్ధరాత్రి తిరుపతి డిపోకు చేరుకుంటాయి.

భూ వివాదంలో దాడి

ఐదుగురికి గాయాలు

బాలాయపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భూ వివాదమై జరిగిన ఘర్షణలో ఐదుగురు గాయపడిన ఘటన బాలాయపల్లి మండలంలోని మన్నూరు బుధవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు... మన్నూరు గ్రామానికి చెందిన కాటూరు రామతులసి చెన్నైలో ఉంటోంది. ఆమెకు స్థానికంగా ఉన్న భూమిని సమీపంలోని బీసీ కాలనీకి చెందిన కొందరు ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో రామతులసి బుధవారం గ్రామానికి చేరుకుని భూమిని పరిశీలిస్తుండగా బీసీ కాలనీవాసులు ఆమెతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన చెన్నూరు మస్తాన్, ఒప్పతొట్టి రమణయ్య, ఒప్పతొట్టి చిరంజీవి, గంపా సంపూర్ణమ్మ, చెన్నూరు సుజాత సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా వారిపై బీసీ కాలనీకి చెందిన జడపల్లి సురేష్, జడపల్లి బాబు, జడపల్లి సురేంద్ర, శ్రీనివాసులు, పరుచూరి రత్నమ్మ, వినయ్ దాడి చేసి గాయపరిచారు. క్షతగాత్రులు చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి తరలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు


బాలింతలకు దుస్తులు, పౌష్టికాహారం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

తడ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. వరదయ్యపాళెం మండలం తొండూరు గ్రామానికి చెందిన వెంకటేష్ బైక్‌పై తడకు వెళ్తుండగా శ్రీకాళహస్తి రోడ్డులో కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేష్ కుడికాలు విరిగిపోయింది. 108 వాహనంలో క్షతగాత్రుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

బాలింతలకు దుస్తులు, పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు దుస్తులు, పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌వీ రావు, గోపినాథరెడ్డి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

మనుధర్మ శాస్త్రం ప్రతుల దహనం

కోట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోఅంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మనుధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేశారు. అంతకముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి నాయకులు మీజూరు మాధవ్, అశోక్ కాంబ్లే, పాలా మల్లికార్జున్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 25,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద నివాసం ఉంటున్న సోమశేఖర్(46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మంగళవారం సోమశేఖర్ జగనన్న కాలనీలోని ఇంటి వద్దకు వెళాడు. అప్పటి నుంచి రెండు రోజులైనా ఫోన్ చేయకపోవడంతో బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులు వెళ్లగా రోడ్డుపై పడి ఉండడంతో 108వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే సోమశేఖర్ మరణించారని డాక్టర్లు నిర్ధారించారు. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం చేస్తామని డాక్టర్ సాయి తెలిపారు.

అంతర్‌జిల్లాల దొంగ అరెస్ట్

117 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న సీఐ మద్దయ్య ఆచారి

పాకాల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంతర్‌జిల్లాల దొంగను పోలీసులు పట్టుకుని 117 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు... ఇటీవల పాకాల పరిసరాల్లో వరుసగా చోరీలు జరుగుతున్నాయి. దీంతో ప్రత్యేక నిఘా పెట్టారు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం పాకాల రైల్వే స్టేషన్ ఎదుట అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె రామారావు కాలనీకి చెందిన శ్రీనివాసులుగా గుర్తించారు. నిందితుడు చిత్తూరు, కదిరి, మదనపల్లె ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ పదేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. వివిధ జిల్లాల్లో 20 కేసులున్నాయి. తాజాగా ఇతని నుంచి 117 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామ సీఐ తెలిపారు.

తిరుపతిలో ఈవో సుడిగాలి పర్యటన

వైకుంఠ ఏకాదశి టికెట్ల పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో శ్యామలరావు బుధవారం తిరుపతిలో సుడిగాలి పర్యటన చేశారు. వైకుంఠ ఏకాదశికి సంబంధించి వచ్చేనెల 8వ తేదీ నుంచి జారీ చేయనున్న టికెట్ కౌంటర్లను పరిశీలించారు. ముందుగా రామచంద్ర పుష్కరిణి వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. గత ఏడాది 10 రోజుల పాటు టికెట్లు జారీ చేశామని, ఈసారి మూడు రోజులు మాత్రమే ఇస్తే కౌంటర్ల వద్ద తొక్కిసలాట జరిగే అవకాశాలున్నాయని అధికారులు ఈవో దృష్టికి తెచ్చారు. కొన్ని కౌంటర్ల వద్ద భక్తులు గంటల తరబడి రోడ్లపై నిలబడాల్సి వస్తుందని చెప్పగా టెంట్లు వేసి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఈవో ఆదేశించారు. అనంతరం భూదేవి కాంప్లెక్సు, జీవకోన, మున్సిపల్ గ్రౌండు, బైరాగిపట్టెడ, ఎంఆర్‌పల్లి ప్రాంతాల్లో కౌంటర్ల స్థితిగతులపై ఆరా తీశారు. కౌంటర్ల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, ఆహార పొట్లాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, టీటీడీ, రెవెన్యూ, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్‌వో శ్రీధర్, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఈ సత్యనారాయణ, ఎస్ఈ వెంకటేశ్వర్లు, మనోహర్, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, టీటీడీ చీఫ్ పీఆర్‌ఓ రవి, తిరుపతి అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ, వీజీవో, ఏవీఎస్‌ఓలు మోహన్‌రెడ్డి, సతీష్ ఆయన వెంట ఉన్నారు.

9వ తేదీ ఉదయం 5 నుంచి టికెట్లు జారీ

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జనవరి 9వ తేదీ ఉదయం 5 గంటల నుంచి మూడు రోజుల పాటు తిరుపతిలోని ఎనిమిది కౌంటర్లు, తిరుమలలోని ఒక కౌంటరు ద్వారా టికెట్లు జారీ చేస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు చెప్పారు. భూదేవి కాంప్లెక్సు వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ భక్తులు ఆధార్ కార్డులు చూపించి, టోకెన్లు పొందవచ్చన్నారు. ఈసారి ఫొటోతో కూడిన స్లిప్పులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. 10నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు.

మళ్లీ ముసురేసింది... గుబులు రేపింది!



సత్యవేడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, లక్షద్వీప్ ప్రాంతంలో నెలకొన్న ఉపరితల ఆవర్తనం కారణంగా గత రెండు రోజులుగా ముసురు వానలు వీడడంలేదు. చలి గాలులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వరుస వర్షాలతో సతమతమైన మండల ప్రజలు ముసురు వానలతో బెంబేలెత్తుతున్నారు. చలిగాలులకు చంటి పిల్లలు, వృద్ధులు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇదిలా ఉండగా ముసురు వానల వల్ల పంటలను తెగుళ్ల ఆశించే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముసురు వానలు మరో రెండు రోజులు ఇలాగే కొనసాగితే దిగుబడులపై ప్రభావం చూపి నష్టాలు చవి చూడాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

రెండు ద్విచక్ర వాహనాల చోరీ



హ్యాండిల్ లాక్ ధ్వంసం చేసి ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్తున్న యువకుడు

శ్రీకాళహస్తి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఒకే రోజు రాత్రి రెండు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీ జరిగింది. దక్షిణ కైలాస్‌నగర్ కాలనీకి చెందిన దివ్య మూడు రోజుల క్రితం హోండా యాక్టివా ద్విచక్రవాహనాన్ని కొనుగోలు చేసింది. తన ఇంటి ముందర పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని యువకుడు కాలితో హ్యాండిల్ లాక్ ధ్వంసం చేసి ప్రభుత్వాస్పత్రి వైపు తీసుకుని వెళ్లిపోయాడు. చోరీ దృశ్యాలు సీసీ ఈ కెమెరాల్లో నమోదయ్యాయి. దీనిపై బాధితురాలు శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు కాలేదు. అలాగే పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో ఓ సాఫ్ట్‌వేర్ యువకుడు ఇంటి ముందు యమహా ఆర్15 బైక్‌ను ఉంచాడు. చోరీకి గురైంది. ద్విచక్ర వాహనం చోరీకి గురైన విషయాన్ని గుర్తించిన యువకుడు శ్రీకాళహస్తి 1వ పట్టణపోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ గోపి బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాడు.

వ్యాసరచన పోటీల్లో ఝాన్సీ ప్రతిభ

వరదయ్యపాళెం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి):జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు విజయవాడలో జరిగాయి. వరదయ్యపాళెం మండలం సంత వేలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఝాన్సీ ఈ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచింది. విజయవాడలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకుంది. ఈ సందర్భంగా ఝాన్సీని ప్రధానోపాధ్యాయుడు మాధవయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

పల్లిపట్టు నాగరాజుకు సాహితీ పురస్కారం



పల్లిపట్టు నాగరాజును సన్మానిస్తున్న రచయితలు

వరదయ్యపాళెం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తిరుపతి నగరంలోని యూత్ హాస్టల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వరదయ్యపాళెం ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్లు నాగరాజును పురస్కారంతో సత్కరించి రూ.5వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు, కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, రచయితలు గార్లపాటి దామోదర నాయుడు, తేట వెంకటేశ్వర్లు, తమటం రామచంద్రారెడ్డి, జయరాంప్రసాద్, యువశ్రీ మురళి, శ్రీమన్నారాయణ, పరమేశ్వరయ్య, పురుషోత్తమాచారి తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి



పోస్టర్ల ఆవిష్కరణలో కోలా ఆనంద్ తదితరులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): హైందవ శంఖారావాన్ని విజయంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాళహస్తి నియోజకవర్గ కన్వీనర్ కోలా ఆనంద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని నెహ్రూరోడ్డులో ఉన్న శ్రీరామ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం బహిరంగ సభకు శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి భారీస్థాయిలో తరలి రావాలని కోరారు. పార్టీలకతీతంగా హాజరై హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం. సుబ్రహ్మణ్యంరెడ్డి, జి.రమేష్‌బాబు, డిల్లీ, గోపాల్, అమర్‌నాథ్, బిందు, నాని, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కలకు వ్యాక్సినేషన్



శ్రీకాళహస్తి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్, కొండమిట్ట, జయరామరావు వీధి ప్రాంతాల్లో వీధి కుక్కలను సురక్షితంగా పట్టుకుని ఇంజెక్షన్లు వేసిన అనంతరం వదలిపెట్టారు.

విద్యుదాఘాతంతో సాగునీటి సంఘం అధ్యక్షుడి మృతి



రఘురామయ్య (ఫైల్‌ఫొటో)

వడమాలపేట, డిసెంబర్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు రఘురామయ్య(65) విద్యుదాఘాతంతో మృతి చెందారు. సోమవారం సాయంత్రం పొలం వద్ద మోటర్ వేయడానికి వెళ్లి నీళ్లలో ఉన్న కరెంట్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందారు. విషయం తెలియని కుటుంబ సభ్యులు.. బంధువుల ఇళ్లల్లో, చట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. చివరకు మంగళవారం రాత్రి గ్రామస్తులు పొలం వద్దకు వెళ్లి చూడగా మోటర్ వద్ద కరెంట్ వైర్లు పట్టుకుని మృతి చెందినట్లు గుర్తించారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ... టీడీపీ సీనియర్ నాయకుడు రఘురామయ్య మృతి బాధాకరమన్నారు. ఆయన ఇటీవల సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా గెలిచారన్నారు. ఆయన మృతి టీడీపీకి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. కాగా పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.

మంత్రిని కలిసిన ఎంజీఎం డైరెక్టర్

శ్రీకాళహస్తి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎంజీఎం గ్రూప్స్ డైరెక్టర్ మయూర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. శివం టూ శివం రోడ్డు మంజూరుపై మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్రీస్తు సందేశం ఆచరణీయం

ఘనంగా క్రిస్మస్ వేడుకలు





బీఎన్‌కండ్రిగ ఈసీఐ చర్చిలో, రేణిగుంట జెరూసలేం అపోస్టలిక్ చర్చిలో ప్రార్థనలు - పిచ్చాటూరు ఇందిరానగర్ చర్చిలో దుస్తుల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో క్రిస్మస్‌ను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం రాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పట్టణంలోని ఈసీఐ చర్చిలో పాస్టర్ జయపాల్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కాంపాళెం, లక్ష్మీపురం, కుమార వెంకటాపురం, కంచన పుత్తూరు, కనమనంబేడు తదితర గ్రామాల్లోని చర్చిల్లో కూడా క్రిస్మస్ వేడుకలు జరిగాయి.

కేవీబీపురం: మండలంలోని వగత్తూరు, సదాశివపురం, కళత్తూరు, పాతపాళెం, ఓళ్లూరు, కేవీబీపురంలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. వగత్తూరు ఎస్టీకాలనీ, సదాశివపురం, రాయపేడుల్లో దుస్తులు పంపిణీ చేశారు.

రేణిగుంట: మండలంలో క్రిస్మస్ వేడకలను ఘనంగా నిర్వహించారు. జెరూసలేం అపోస్టోలిక్, సెయింట్ జాన్స్ లూథరన్, ఆర్‌సీఎం, జీవగ్రామం లూథరన్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు బోధించిన మార్గంలో ప్రేమ, క్షమాగుణం, కరుణతో నడుచుకోవాలని సూచించారు.

నాగలాపురం: పట్టణంలోని బ్యాలా పరిశుద్ధ ప్రార్థన మందిరంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సంఘ వ్యవస్థాపకుడు విజయ నరసింహులు, కామాక్షయ్య ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం 150 మందికి వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భూషణం, రఫి, జాన్‌వెసెత్, రాహుల్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డేవిడ్ లూయిస్ రీస్ ఆస్పత్రి, ఏర్పేడు చర్చి, మేర్లపాక చర్చి, మర్రిమంద, పాతవీరాపురం, నచ్చనేరి, సీతారామపేట చర్చిల్లో ఫాదర్ల నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సత్యవేడు: కరుణామయుడు ఏసు ప్రభువు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చి, హోసన్నా మందిరం, బెరాకా, పెంతెకొస్తు తదితర ప్రధాన చర్చిలతో పాటు గ్రామాల్లోని చర్చిల్లో బుధవారం వేకువ జాము నుంచి సామూహిక ప్రార్థనలతో సందడి నెలకొంది. పాస్టర్లు పవిత్ర బైబిల్ సూక్తులను చదివి, క్రీస్తు శాంతి సందేశాన్ని వినిపించారు.

పిచ్చాటూరు: పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీలోని చర్చిలో మాజీ సర్పంచు సుగంధి నాగూర్ దుస్తులు పంపిణీ చేశారు. మానవ సేవే ప్రధానమన్న క్రీస్తు సూక్తితో పేదలకు దుస్తులు అందించామన్నారు. దివ్య, విక్రమ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.





వగత్తూరులో మహిళలకు చీరల పంపిణీ - సత్యవేడు సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు - నాగలాపురం బ్యాలా పరిశుద్ధ ప్రార్థన మందిరంలో కేక్ కటింగ్

వాజ్‌పేయి జయంతి వేడుకలు




శ్రీకాళహస్తి, వరదయ్యపాళెంలలో వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు కూడలి వద్ద మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి 100వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయనకు నివాళులర్పించి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ... ఆయన తన ప్రసంగాలతో పార్లమెంట్‌లో మంత్రము గ్ధులను చేసేవారన్నారు. ఆయన అవకాశవాద రాజకీయాలకు దూరమని తెలిపారు. 1999లో ఒక్క ఓటు తేడాతో లోక్‌సభలో ఓడిపోయినా హుందాగా తన పదవికి రాజీనామా చేసి ప్రజల వద్దకు వెళ్లి అసాధారణ విజయం సాధించారని గుర్తు చేశారు. బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, జి.రమేష్‌బాబు, అమర్‌నాథ్, డిల్లీబాబు, ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: పట్టణంలో బుధవారం ఘనంగా మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలు కేబీజీ గురుదేవ్ కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేబీ గురుదేవ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురుదేవ్ మాట్లాడుతూ వాజ్‌పేయి సేవలను కొనియాడారు. గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: భారత మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని పిచ్చాటూరు మండల బీజేపీ అధ్యక్షుడు ఆనందనాయుడు బుధవారం ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం అభివృద్ధి కోసం సర్వం త్యాజించిన త్యాగశీలి అని కొనయాడారు.

చింతలపాళెంలో చిరుత కలకలం

పరీక్షించిన అటవీశాఖ అధికారులు



ఏర్పేడు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపాళెం, శ్రీకాళహస్తి మండలానికి చెరందిన కుంటిపూడి సరిహద్దు పొలాల్లో రెండు రోజులుగా చిరుత సంచరిస్తున్నట్లు కలకలం రేగింది. దీంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు బుధవారం అటవీశాఖ సెక్షన్ అధికారి రెడ్డెప్ప చింతలపాళెం, కుంటిపూడి ప్రాంతాల్లో పర్యటించారు. రైతులు చెప్పిన ప్రాంతాల్లో పాదముద్రలను సేకరించారు. వాటిని పరిశీలించిన అనంతరం రెడ్డెప్ప మాట్లాడుతూ... పాదముద్రలు చిరుత, నక్క, అడవిపంది తదితరాలపై అనుమానం వ్యక్తం చేశారు. గురువారం కూడా ఆ ప్రాంతాల్లో అటవీశాఖ అధికారుల బృందం పర్యటించి పాదముద్రలను పరిశీలించనున్నట్లు చెప్పారు.

రెండో విడత ధనుర్మాస బస్సు యాత్ర



తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం సందర్భంగా ఆర్టీసీ రెండో విడత బస్సు యాత్ర బుధవారం ఉదయం మొదలైంది. సెంట్రల్ బస్టేషన్ నుంచి బయలుదేరిన రెండు బస్సులు కాణిపాకం, శ్రీపురం, కాంచీపురానికి వెళ్లి తిరిగి అర్ధరాత్రి తిరుపతి డిపోకు చేరుకుంటాయి. యాత్ర చేయాలనుకునే భక్తులు 9440983564, 7382881507లను సంప్రదించాలని డిపో మేనేజర్ బాలాజీ కోరారు.

కొత్తవీరాపురం వద్ద ఇసుక అక్రమ రవాణా

అడ్డుకున్న రైతుపై అక్రమార్కుల దాడి



కొత్తవీరాపురం స్వర్ణముఖి నదిలో పట్టపగలే ఇసుక తోడుతున్న అక్రమార్కులు

ఏర్పేడు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తరలింపును అడ్డుకున్న రైతుపై దాడి జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. మండలంలోని మోదుగులపాళెం, కొత్తవీరాపురం మధ్య ఉన్న స్వర్ణముఖి నదిలో కొంతమంది అక్రమార్కులు గత నాలుగు రోజులుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దీన్ని అడ్డుకున్న తనపై అడ్డుకోగా బుధవారం సాయంత్రం దుర్వాసులునాయుడు దాడి చేసినట్లు రేణిగుంట డీఎస్పీ నరసింహమూర్తికి స్థానిక రైతు గాలి సుదర్శన్‌నాయుడు ఫిర్యాదు చేశారు. అలాగే రెవెన్యూ అధికారులకు, మైనింగ్ అధికారులకు కూడా సుదర్శన్‌నాయుడు ఫిర్యాదు చేశారు. ఇసుక రవాణాను అడ్డుకోకపోతే మోదుగులపాళెం, కొత్తవీరాపురంలలో వందలాది ఎకరాలకు సాగునీరు అందదని రైతు సుదర్శననాయుడు వాపోయారు. స్పందించిన అధికారులు బుధవారం సెలవుదినం కావడంతో గురువారం ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామని తన మొబైల్‌కు ఫోన్ చేసినట్లు రైతు తెలిపారు.

28న బ్లాక్ స్పోర్ట్స్ మీట్

వరదయ్యపాళెం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్రం, వరదయ్యపాళెంకు చెందిన స్వచ్ఛ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం బ్లాక్ స్పోర్ట్స్ మీట్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలో పాల్గొనేందుకు 19 సంవత్సరాలు పైబడి ఉండాలి. వాలీబాల్, షటిల్, రన్నింగ్ వంటి క్రీడలు నిర్వహించనున్నారు. విజేతలకు జనవరి 12న యువజన వారోత్సవాలల్లో చిత్తూరు కలెక్టరేట్‌లో బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీలు జరుగుతాయి.

మనోన్మణి ఉత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని బుధవారం మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో గొబ్బెమ్మకు అభిషేకాలు నిర్వహించి, విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారిని చప్పరంపై అధిష్ఠించి పట్టణంలో ఊరేగించారు. భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



శ్రీకాళహస్తి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మాధురి గోల్డ్ నిర్వాహకులు క్రిస్మస్‌ను పురస్కరించుకుని బసవయ్యపాళెం సమీపంలో ఉన్న కృపా మిషనరీస్ చర్చిలో బుధవారం వృద్ధులకు దుప్పట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ క్రిస్మస్ పురస్కరించుకుని పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని స్కూటరిస్టు మృతి

రేణిగుంట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామండూరు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని స్కూటరిస్టు మృతి చెందాడు. గుంటూరు జిల్లాకు చెందిన శ్రీనివాసులు(25) తిరుపతి నుంచి ద్విచక్రవాహనంలో కోడూరులోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో మామండూరు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని దుర్మరణం చెందాడు. అటుగా వెళ్తున్న వాహనదారుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాట్‌ఫాంపై తాగునీటి లీకేజీ



రేణిగుంట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైల్వేస్టేషన్‌లోని రెండు, మూడో నెంబర్ల ప్లాట్‌ఫాం మధ్యలో ఉన్న తాగునీటి కొళాయిలు లీకవుతున్నాయి. ప్రయాణికుల తాగునీటి అవసరాల కోసం ఈ కొళాయిలను ఏర్పాటు చేశారు. అయితే లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పోతోంది. అంతేగాకుండా ప్లాట్‌ఫాంపై నీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులు జారి పడే అవకాశం లేకపోలేదు. గతకొన్ని రోజులుగా ఈ పరిస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలి.

వాడవాడలా క్రిస్మస్ సంబరాలు




గేటు పుత్తూరులోని సెయింట్ లూథరన్ చర్చిలో ప్రార్థన - హెబ్రోను చర్చిలో కేక్ కటింగ్

పుత్తూరు టౌన్, డిసెంబర్ 25(ఆంధ్రజ్యోతి): గేటు పుత్తూరులోని సెయింట్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా ఏసు ప్రభువును కీర్తిస్తూ గానాలాపన చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎన్జీవో కాలనీలో ఉన్న చర్చి ఆఫ్ క్రైస్ట్‌లో పాస్టర్ సెల్వం అధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు.

వడమాలపేట: ప్రతి ఒక్కరూ కరుణ, సహనం, త్యాగ గుణాలను అలవాటుగా చేసుకుని జీవితాన్ని శాంతియుతంగా గడపాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం స్థానిక హెబ్రోను చర్చిలో జరిగిన ప్రార్థనలో పాల్గొని క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేశారు.

టీడీపీ ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సంబరాలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎంబీ రోడ్డులోని కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఏసు చూపిన మార్గంలో ప్రేమ, శాంతి, సామరస్యంతో కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర మంగళం ఎంపీటీసీ సభ్యురాలు శ్రీజ బాలాజీనాయుడు, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధనపాల్, సూపర్‌బజార్ చైర్మన్ చంద్రయాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాండురంగయ్య, తెలుగుమహిళా కార్యదర్శి నాగరత్నం, పాండురంగయ్య, దాసరి విజయ్ చౌదరి, మణికంఠ, కృష్ణమనాయుడు, శంకర్ నాయుడు, పోతుగుంట రమేష్, తాతినేని రాజ పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

రేపు ఆదాయ పన్ను చెల్లింపులపై అవగాహన

పుత్తూరు అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్ను చెల్లింపులపై పుత్తూరులో వ్యాపారులకు, ఉద్యోగులకు తిరుపతి శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించనున్నారు. గురువారం ఆర్డీఎం గేట్ సమీపంలోని కేపీ రెసిడెన్సీలో ఉదయం 10 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా ఇన్‌కంట్యాక్స్ జాయింట్ సెక్రటరీ టి.వి.వంశీధర్ హాజరుకానున్నారు. ఈ మేరకు తిరుపతి ఇన్‌కంట్యాక్స్ అధికారి శివరామకృష్ణ విచ్చేయనున్నారు. పుత్తూరు పరిధిలోని ప్రతి ఒక్కరు హాజరై ఆదాయపు పన్ను పట్ల ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకోవాలని అధికారులు కోరారు.